

సత్యవాక్కు
THE
WORD OF
TRUTH
క్రైస్తవ మాసపత్రిక
JUNE - 2005

# సంక్షిప్త వార్తలు

2005 ఏప్రియల్ 20, 21, 22 తేదీలలో చదలాడ, గోరింట గ్రామములలో సువార్త సభలు జరిగెను. పగటి వేళ పురుషులకు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించబడెను. రాత్రివేళ బహిరంగ సువార్త కూడికలు ఏర్పాటు చేయబడెను. ఆ కూటములలో సోదరులు జాషువా గూటంగారు, యం.కృపానందం గారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘ యువకులు చక్కటి కృషి చేసి సభలను జయప్రదం గావించిరి. చదలాడ గోరింట గ్రామములలో సోదరులు యం.ప్రేమ్ కుమార్ గారు సువార్త చాటుచున్నారు.

ఏప్రియల్ 25, 26, 27 తేదీలో రఘుదేవపురంలో యున్న స్థానిక సంఘము వార్షిక సువార్త కూటములు నేర్పాటు చేసిరి. ఆ కూటములలో సోదరులు సంజీవరావ్ మరియు కృపానందం గార్లు వాక్య పరిచర్య చేసిరి. రఘుదేవపురంలో యం.కృపానందం గారు సువార్త పనిచేయుచున్నారు.

ఏప్రియల్ 29వ తేదీ నాడు కపిలేశ్వరపురం మండలం వాసాల రేవు గ్రామములో యున్న స్థానిక సంఘం సువార్త కూటము నేర్పాటు చేసిరి. ఆ కూటములో సోదరులు జాషువా గారు, బాబి ఆల్బర్ట్ తదితరులు వాక్యపరిచర్య చేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిరి. వాసాల రేవులో సోదరులు యస్.సామ్యూల్ రాజుగారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

2005 మే నెల 3, 4, 5 తేదీలలో పులిమేరులో సువార్త కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు సంజీవరావ్ (పెద్దాపురం),

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | జూన్ 2005 | సంచిక 11


# క్రీస్తు నిజముగా ఇప్పుడు రాజై యున్నాడా?

## (Is Christ really the King now?)

ప్రవచింపబడిన పరలోక రాజ్యము స్థాపించబడినదని, అది యెరూషలేములో క్రీ॥శ॥ 33వ సంవత్సరములో పెంతెకోస్తు అను పండుగ దినమున స్థాపించబడెనని మనము గతసారి నేర్చుకొన్నాము. స్థాపించబడిన ఆ పరలోక రాజ్యమే క్రీస్తు సంఘము అని కూడా మనము గమనించాము. సంఘమునకు శిరస్సు క్రీస్తు అని వాక్యము బోధించుచున్నది. ఆయన సంఘమే ఆయన రాజ్యము అని కూడా వాక్యము బోధించుచున్నది. అట్లయిన ఆ రాజ్యమునకు క్రీస్తు రాజైయుండవలెను గదా? అందువలన యేసుక్రీస్తు నిజముగా ఇప్పుడు రాజై యున్నాడో లేదో మనము పరిశీలింతము.

యేసుక్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు ఈ భూమిపై తన రాజ్యమును స్థాపించుననియు, వెయ్యేండ్లు ఆయన పరిపాలన చేయుననియు అనేకులు భావించు

చున్నారు. అయితే దేవుని వాక్యము అట్లు బోధించుట లేదు. యేసుక్రీస్తు తన రాజ్యమును స్థాపించి యున్నాడనియు, ఆ రాజ్యమే ఆయన సంఘమనియు, అందువలన ఆయన ఇప్పుడు రాజైయున్నాడనియు బైబిలు బోధించుచున్నది. సరిగదా ఆయన రెండవసారి వచ్చినప్పుడు తన పరిపాలనను చాలించి రాజ్యమును తన తండ్రికి అప్పగించుననియు వాక్యము చెప్పుచున్నది. 1 కొరింధి 15:24లో, "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" అని వ్రాయబడి యున్నది. అంతము ఎప్పుడు వచ్చును? క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు అంతము వచ్చును అని 23వ వచనము చెప్పుచున్నది. ఆయన వచ్చినప్పుడు ఏమి జరుగును? తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించుట జరుగును. 25వ వచనము ఇట్లు చెప్పుచున్నది: "ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచు వరకు ఆయన రాజ్య పరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము". పాపము వలన వచ్చిన మరణము నాశనమయ్యే వరకు యేసుక్రీస్తు తన రాజ్యమును పరిపాలించును. మరణమనునది ఇక లేకుండ ఎప్పుడు నాశనమగును? ఆయన రెండవ రాకడలోనేగదా? అందువలన యేసుక్రీస్తు ఇప్పుడు రాజైయున్నాడు. ఆయన తన రాజ్యమైన సంఘమును ఆయన రెండవ రాకడవరకు పరిపాలించును. అంతట తన రాజ్యమును తన తండ్రికి అప్పగించును.

యేసు చనిపోవకముందు ఆయన రాజ్యమును గూర్చి తన శిష్యులకును, జనసమూహములకును చాల బోధించెను. "నీవు సజీవుడవైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ఆయనను ఒప్పుకొనగా, యేసు ఈ బండమీద, అనగా నేను దేవుని కుమారుడను అను బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు అని పేతురుతో చెప్పెను. అంతేకాదు పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను అని ఆయన పేతురుతో చెప్పెను (మత్తయి 16:16-19).

అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో పరలోక రాజ్యస్థాపనమును గూర్చి చెప్పబడిన ప్రవచనము లన్నియును నెరవేరుటను మనము చూచియుంటిమి

పెంతెకోస్తు అను పండుగ దినమున పరలోక రాజ్యము స్థాపింపబడగా, మొట్ట మొదటి సువార్త ప్రసంగమును చేసినది ఎవరు? పేతురే గదా. ఆ దినమున పరలోక రాజ్యములో చేర్చబడుటకు మొట్ట మొదటిగా ఆయా షరతులను (అపొ.కా. 2:38) తెలియజేసినది ఎవరు? పేతురే గదా. కాబట్టి అతని వాక్యము నంగీకరించి నవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమున ఇంచుమించు మూడువేలమంది పరలోక రాజ్యములో లేక క్రీస్తు సంఘములో చేర్చ బడిరి (అపొ.కా. 2:41). ఈ పరలోక రాజ్యము మరెన్నటికిని నాశనము కాదు. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు. పరిశుద్ధాత్మ ద్వారా పరలోక రాజ్యపు ద్వారములను యూదులకు, అన్యజ నులకు కూడ పేతురే మొట్టమొదటిగా తెరచెను. ఆనాటి నుండి నేటివరకు క్రీస్తు సువార్తకు లోబడుచున్న వారి నందరినీ ప్రభువు తన ఆత్మీయ రాజ్యములో చేర్చు చున్నారు.

క్రీస్తు సంఘమే క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్యమో కాదో ఇప్పుడు తెలిసి కొందాము. ఏదైనా ఒక రాజ్యము, రాజ్య ముగా పరిగణింప బడవలెనంటే దానికి కనీసము నాలుగు సంగతులు అవుసరమై యున్నవి. మొట్టమొదటిగా రాజ్యమును పరిపాలించు రాజు ఒకడుండవలెను, అతడు పాలనచేయు భూభాగము లేదా సామ్రాజ్యముండవలెను, పరిపాలింపబడు టకు పౌరులు ఉండవలెను, అటు తరువాత వారిని పరిపాలించుటకొక రాజ్యాంగము లేదా చట్టము ఉండవలెను. యేసు క్రీస్తు పరిపాలించుచున్న రాజ్యమునకు ఈ నాలుగు లక్షణములు ఉన్నవో లేదో పరిశీలించుదాం.

యూదులు యేసును పట్టుకొని పిలాతు అను రోమా ప్రభుత్వ గవర్నరుకు అప్పగించినప్పుడు యేసు అతనితో నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు అని చెప్పెను (యోహాను 18:36). అది ఆత్మీయ రాజ్యమై యున్నది. అందుచే దానికి భూమిమీద ఒక కేంద్రస్థానము లేదు. క్రీస్తు రాజ్యము ఆత్మీయమై యున్నది, దాని సామ్రాజ్యము ఆత్మీయ మైనది, అందున్న పౌరులు ఆత్మీయమైన వారు, వారికున్న రాజ్యాంగము ఆత్మీయ మైనది అని మనము గ్రహించవలెను. ఈ నాలుగు అంశములను ఒక్కొక్కదానిని ఇప్పుడు పరిశీలింతము.

యేసుక్రీస్తు తన ఆత్మీయ రాజ్యము నకు రాజైయున్నాడు. క్రీస్తు జన్మించక

ముందే గబ్రియేలను దేవదూత కన్యయైన మరియకు కన్పడి "ఇదిగో, నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు......ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను" (లూకా 1:31-33). యేసు పునరుత్థానుడైన తరువాత పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది అని చెప్పెను (మత్తయి 28:18). గనుక ఆయన ఇప్పుడు సర్వాధికారియై యున్నాడు. ఆత్మీయ రాజ్యమైన తన సంఘమునకు ఆయన ఇప్పుడు రాజై యున్నాడు.

ఆయన పరిపాలించు సామ్రాజ్యము ఏమై యున్నది? నా రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు అని యేసు చెప్పెను గనుక ఆయన ఒక ప్రత్యేక భూభాగమును పరిపాలించువాడు కాదు. అయితే ఆయన రాజ్యము ఎక్కడ ఉన్నది? అని మనము యేసును అడిగిన యెడల, "దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది" అని లూకా 17:21లో ఆయన జవాబిచ్చుచున్నారు. గనుక ప్రజలు ఎక్కడ ఉన్నను వారి హృదయములలో క్రీస్తు పరిపాలించువాడై యున్నాడు. అందువలన క్రీస్తు పరిపాలించు సామ్రాజ్యము ఆత్మీయ సామ్రాజ్యమై యున్నది. ఆ రాజ్యమే క్రీస్తు సంఘము. ఎక్కడయితే ప్రజలు యేసుక్రీస్తు అధికారము నకు సంపూర్ణముగా విధేయులై యుందురో వారి మధ్యను దేవుని రాజ్యమున్నది (మత్తయి 18:20). యేసుక్రీస్తు మీ హృదయములో నుండి పరిపాలింప గోరుచున్నాడు. మీరు ఆయనను ఆహ్వానించిన యెడల మీరును ఆయన రాజ్యములో భాగస్తులు కాగలరు.

ఆయన పరిపాలించు పౌరులు ఎవరు? దేవుని సామ్రాజ్యము, సాతాను సామ్రాజ్యము - ఈ రెండూ సార్వజనికమైనవి గనుక మనలో ప్రతివాడును ఈరెండింటిలో దేనిలో ఒకదానిలో పౌరులమై యున్నాము. ఎవరయితే తమ హృదయములను, ఆత్మలను రాజులకు రాజైన యేసుక్రీస్తుకు సంపూర్తిగ సమర్పించుకొందురో వారు క్రీస్తు రాజ్యము యొక్క ఆత్మీయ పౌరులు. సర్వలోకమందున్న సర్వజనాంగములు ఒకే ఒక భక్తి మార్గమందుండి క్రీస్తుకు విధేయులు కావలెనని దేవుడు కోరుచున్నాడు. యేసుక్రీస్తు యొక్క అపొస్తలులు అన్ని తరగతుల వారిని, మతముల వారిని క్రీస్తు మార్గములోనికి మార్చుచు కృషి చేసిరి. ఈ ప్రజలందరు

ఒకే ఒక్క శరీరములో ఏకమైరి. ఆ శరీరమే క్రీస్తు సంఘము. సంఘము ద్వారా భూలోక ప్రజలందరు ఏకమై యుండవలెనని, వారందరు ఆయన రాజ్యములో సహ పౌరులు కావలెనని దేవుడు కోరుచున్నాడు.

ఆఖరిగా ఈ ఆత్మీయ రాజ్యమునందు అమలులో యున్న చట్టము లేదా రాజ్యాంగము ఏది? అని మనమడుగవచ్చును. ప్రజలు తమ కిష్టము వచ్చిన సూత్రములను ఈ ఆత్మీయ రాజ్యములో ప్రవేశపెట్టుటకు అవకాశము లేకుండా దేవుడే క్రొత్త నిబంధన గ్రంధమును తన ఏకైక రాజ్యాంగముగా మనకిచ్చియున్నాడు. అది జీవము గల దేవుని ఆత్మతో వ్రాయబడిన ద్వారా క్రొత్త నిబంధనకు మనము లోబడవలెను. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొనుడి" యని యేసు చెప్పెను (యోహా 14:15). అపొస్తలుల కాలములో క్రొత్త నిబంధన ఆజ్ఞలకు ప్రేమతో లోబడిన ప్రజలందరు ఒకే ఒక్క సంఘమందు ఏకమై యుండిరి. ప్రజలందరు ఒకేరీతిగ ఒకే చట్టమునకు లోబడిన యెడల సహజముగా వారిలో ఐక్యత ఉండును గదా. ఈనాడు క్రైస్తవ లోకము వందలకొలది డినామినేషన్లవలె విభజింపబడి యున్నదంటే వారు క్రీస్తు చట్టమును వదలి తమ తమ స్వసిద్ధాంతములను అవలంబించుచున్నారని అర్థమగుచున్నది.

క్రొత్త నిబంధనను దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా మనకు వ్రాయించి యిచ్చెను (2 తిమో 3:16, 17). దానికి మనము కలుపుట గాని, తీసివేయుట గాని చేయరాదు అని దేవుడు మనలను హెచ్చరించెను (ద్వితీ, 4:2; సామె 30:6; ప్రకటన 22:18, 19).

క్రీస్తు రాజ్యమైన క్రీస్తు సంఘమునకు రాజు క్రీస్తు, ప్రపంచమందున్న ప్రతి క్రైస్తవుని హృదయము ఆయన ఆత్మీయ సామ్రాజ్యము, ఆయనకు విధేయుడైన ప్రతి విశ్వాసియు ఆయన రాజ్యపౌరుడు, ఆయన వ్రాయించి యిచ్చిన క్రొత్త నిబంధన ఒక్కటి మాత్రమే మన ఆత్మీయ నడిపింపునకీయబడిన రాజ్యాంగము. పరలోక రాజ్యము స్థాపించబడి ఇప్పుడు ఉన్నది. అది మన మధ్యనే యున్నది అని మనము గ్రహించియుంటిమి. ఆ రాజ్యపౌరులు కావలెనంటే ఈనాడు మీకు అది సాధ్యమే. యేసుక్రీస్తు ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు అని మీరు విశ్వసించుడి. మీరు చేసిన పాపముల నిమిత్తమై మారుమనస్సు నొంది, ఆయన నామమును ఒప్పుకొనుచూ, బాప్తిస్మము పొందుడి. మీరు అట్లు చేసిన

యెడల మీ పాపముల నుండి మిమ్ములను శుద్ధులనుగా చేసి, మీ పాపములను మీ అక్రమములను ఇకను ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనను అని ప్రభువైన యేసు చెప్పుచున్నారు (హెబ్రీ 8:12; 10:17). ఆయన షరతులకు లోబడి పరలోక రాజ్యపౌరులుగా యుండుటకంటే శ్రేష్ఠమైన సంగతి మరే మున్నది?

- జాషువా గూటం

# దుష్టదూతలు

## (Evil Angles)

దేవుని పనిని జరిగించు దూతలు నమ్మకమైన దూతలని బైబిలు చెప్పు చున్నది. పాపము చేయువారి మీదికి దేవుని ఉగ్రతను రప్పింపజేయు దూతలు నమ్మకమైన దూతలు. ఐగుప్తీయులను దేవుడు శిక్షించిన సందర్భమును గూర్చి చెబుతు "ఆయన ఉపద్రవము కలుగజేయు దూతల సేనగా తన కోపాగ్నిని ఉగ్రతను, మహోగ్రతను శ్రమను వారిమీద విడిచెను" అని కీర్తన 78:49లో వ్రాయబడి యున్నది. ఐగుప్తీయులను శిక్షించుటకు దేవుడు వినియోగించిన దూతలు మంచివారే.

అయితే దూతలలో కూడా చెడ్డ దూతలున్నారని మనము తెలిసికొనుట మంచిది. చెడ్డదూతలు లేక దుష్టదూతలు పాపము చేసిన దూతలు అని మనము గ్రహించుకొనవలెను. దేవునికి వ్యతిరేకముగా పాపము చేసిన దుష్ట దూతలలో కొందరు చెరలో యుంచబడి యున్నారు. "దేవ దూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక పాతాళలోక మందలి కటిక చీకటి గల బిలములలోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" అని 2 పేతురు 2:4లో వ్రాయబడి యున్నది. "మరియు తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమ నివాస స్థలమును విడిచిన దేవదూతలను మహాదినమున జరుగు తీర్పు వరకు కటిక చీకటిలో నిత్యపాశములతో ఆయన బంధించి భద్రము చేసెను" అని యూదా వ్రాసెను (యూదా :6).

ఈ వచనములను బట్టి దేవదూతలు

పాపము చేయగలరు అని మనము గ్రహించు కొనవచ్చును. ఈ దూతలు చేసిన పాపము ఏమిటి? వారు తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమ నివాస స్థలమును విడిచినట్లు మనము చదువుకొన్న వచనమును బట్టి తెలియుచున్నది.

పాపము చేసిన దూతలు పాతాళము లోనికి (నరకము లోనికి) పడద్రోయబడిరి. పాతాళములో వారు కటిక చీకటి గల బిలములోనికి పడద్రోయబడిరి. ఈ చీకటి బిలములో వారు నిత్యపాశములతో బంధింపబడినట్లు యూదా వ్రాసెను. పాపము చేసిన ఈ దూతలు తీర్పు దినము వరకు ఈ చీకటి బిలములలో యుంచ బడు దురని పేతురు, యూదాల ఇద్దరు వ్రాసిరి. ఈ దుష్ట దూతల చెరసాలలోనికి దుష్టుల ఆత్మల కూడ వెళ్ళునని ధనవంతుడు, లాజరు యొక్క కధనమును బట్టి మనము గ్రహించుకొన గలము (లూకా 16:19–31).

కొన్ని దుష్టదూతలు చెరలో బంధింప బడినను మరికొన్ని బంధింపబడకుండగనే యున్నట్లు అర్ధమగుచున్నది. "పరలోక ములో యుద్ధము జరిగెను మిఖయేలును అతని దూతలును ఆ ఘట సర్పముతో యుద్ధము చేయవలెనని యుండగా ఆఘట సర్పమును దాని దూతలును యుద్ధము చేసిరిగాని గెలువలేక పోయిరి గనుక పరలోకమందు వారికి స్థలము లేకపోయెను. కాగా సర్వలోకమును మోస పుచ్చును అపవాది యనియు సాతాన నియు పేరుగల అది సర్పమైన అమహాఘట సర్పము పడద్రోయబడెను. అది భూమి మీద పడద్రోయబడెను; దాని దూతలు దానితో కూడ పడద్రోయబడిరి" యని ప్రకటన 12:7–9లో వర్ణించబడెను. అందు వలన క్రైస్తవులు పోరాడునది శరీరులతో కాదుగాని అంధకార సంబంధమగు లోక నాధులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహముతోను పోరాడు దురు (ఎఫెసీ 6:10–12). చీకటి అగాధ ములో బంధింపబడకుండ తిరుగులాడుచు యున్న దుష్ట దూతలు క్రీస్తు ప్రేమనుండి మనలను వేరుచేయనేరవు. సరిగదా నిత్య నరకము అపవాదికిని అతని దూతల కొరకును సిద్ధపరచబడిన స్థలమై యున్నది (మత్తయి 25:41). అవి యిప్పుడు స్వేచ్ఛ కలిగియున్న విగాని వాటి స్వేచ్ఛ యెల్లప్పుడు ఉండనేరదు.

తరువాత, మనము అపవిత్రాత్మ లను గూర్చి బైబిలులో కనుగొందుము. ఉన్న అపవాది ఒక్కడే అయినను అనేక దురా

త్మలు, అపవిత్రాత్మలు, అపవిత్రాత్మల సమూహములు ఉన్నవని మనము గ్రహించు కొనవలెను. ఈ అపవిత్రాత్మలు యెవరు? అనే ప్రశ్న మనకు రావచ్చును. దుష్టులైన వారి ఆత్మలు అవియని కొందరు చెప్పుచుందురు. అయితే "చచ్చిన వారు ఏమియు ఎరుగరు" అని ప్రసంగి 9:5లో వ్రాయబడి యున్నది. రక్షింపబడిన వారికి నాశనములో యున్న వారికి మధ్య ఒకగొప్ప అగాధమున్నట్లు లూకా 16:26ను బట్టి మనకు తెలియు చున్నది. గనుక ఇక్కడి వారక్కడికి వెళ్ళలేరు అక్కడి వారిక్కడికి రాలేరు. అందువలన ఈ దురాత్మలు దుష్టుల ఆత్మలు కాదుగాని చీకటి బిలములో బంధింపబడక విడిచిపెట్టబడిన భ్రష్టులైన దేవదూతలు అని మనము గ్రహించు కొనవచ్చును.

అయితే ఈ దురాత్మలు ఎట్లుం దురు? వారు ఒక గాలి వంటివారు ఏదో ఒక ప్రభావము వంటివారు కాదుగాని వారు భౌతిక కాయులు గాక తెలివికలిగి ప్రవర్తింప గల దుష్ట ఆత్మలు. వాటికి భౌతిక శరీరము లేదుగాని అవి ఆత్మలు మాత్రమే. ఆత్మయై నది అది మంచిదేగాని చెడ్డదేగాని, దానికి రక్తమాంసములు ఉండనేరవు. యేసు పునరుత్థానుడైన తరువాత తన శిష్యుల మధ్యను నిలిచెను. "నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదము లను చూడుడి; నన్ను పట్టి చూడుడి; నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెము కలును మాంసమును భూతమునకుండవని చెప్పెను" (లూకా 24:39). మత్తయి 8:16లో "సాయంకాలమైనప్పుడు జనులు దయ్య ములు పట్టిన అనేకులను ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. ఆయన మాటవలన దయ్య ములను వెళ్ళగొట్టి రోగుల నెల్లను స్వస్థపర చెను" అని వ్రాయబడి యున్నది.

దయ్యములే దురాత్మలు అని మనము తెలిసికొన వచ్చును: "అపవిత్రాత్మ ఒక మనుష్యుని దలి పోయిన తరువాత అది విశ్రాంతి వెదకుచు నీరు లేనిచోట్ల తిరుగుచుండును. విశ్రాంతి దొరకనందును నేను వదలివచ్చిన నాయింటికి తిరిగి వెళ్ళుదనను కొనివచ్చి అయింట ఎవరు లేక అది ఊడ్చి అమర్చి యుండుట చూచి వెళ్ళి తనకంటె చెడ్డవైన మరి యేడు దయ్య ములను వెంటబెట్టుకొని వచ్చును; అవి దానిలో ప్రవేశించి అక్కడనే కాపుర ముండును. అందుచేత అమనుష్యుని కడపటిస్థితి మొదటి స్థితి కంటె చెడ్డదగును. ఆలాగే యీ దుష్టతరము వారికిని సంభ వించును" (మత్తయి 12:43-35).

దయ్యములు తెలివిగలవి. మార్కు 1:24లో "నజరేయుడగు యేసూ మాతో నీకేమి, మమ్ము నశింపజేయుటకు వచ్చితివా? నీ వెవడవో నాకు తెలియును. నీవు దేవుని పరిశుద్ధుడవని యేసును చూచి అవి కేకలు వేసెను. దయ్యము పట్టిసోదె చెప్పగల ఒక చిన్న దానిని గూర్చి అపొ.16:16లో మనము చూడగలము. దయ్యములును యేసును నమ్మి వణకుచున్నవి అని యాకోబు వ్రాసెను (యాకో 2:19).

దయ్యములు పురుషులలోను, స్త్రీలలోను, పిల్లలలోను నివసించగలవు (మత్తయి 9:32; మార్కు 8:2; 5:20). మానసిక భౌతిక రోగములతో దయ్యములు ప్రజలను హింసించుచుండెడివి (మత్తయి 12:24). అవి మూర్ఛకలిగించెను (మార్కు 9:18). మూగ కలిగించెను (మత్తయి 9:32), మతి భ్రమ లేక పిచ్చి కలిగించెను (లూకా 8:26-29). గ్రుడ్డి తనము కలిగించెను (మత్తయి 12:22). ఇంకా ఎన్నో అట్టి శరీరక మానసిక రోగములను కలిగించెను. దయ్యముల అబద్ధబోధను సహించుటయే గాక దానిని ప్రోత్సహించును (1తిమో 4:1). దయ్యములు బోధయందు లక్ష్యముంచువారు కొందరు ఉందురు అని అపొ.పౌలు ముందుగానే హెచ్చరించెను.

దయ్యములు పనిని క్లుప్తముగా చెప్పుకొనవలెనంటే మొదటిగా అవి దేవుని వ్యతిరేకించి ఆయన చిత్తము జరిగించబడకుండా చూచును (మత్త 13:39; యోబు 1:9). రెండవదిగా, దయ్యములు మానవుల తాత్కాలిక క్షేమమును నిత్యజీవిత సుఖమును పాడుచేయును. యిది ప్రకృతి ద్వారాను కొందరిని దయ్యములు పట్టుకొనుట ద్వారాను జరుగును (లూకా 3:11-16; మార్కు 5:2-4). అయితే మానవునికి మించిన అధికారాన్ని ఈ అపవిత్రాత్మలు కలిగియుండలేవు. అందుకే మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్ధన చేయుడని యేసు చెప్పెను (లూకా 22:40). యెవని మ్రింగుదునా యని అపవాది గర్జించు సింహమువలె తిరుగు చున్నాడని పేతురు వ్రాసెను (1 పేతురు 5:8). అపవాది యొక్కయు దయ్యముల యొక్కయు శక్తి కొంతకాలము మట్టుకే యని మనము గమనించవలెను. అవి సర్వశక్తి కలిగినవి కావు, సర్వజ్ఞానము కలిగినవి కావు, సర్వాంతర్యాములు కాదు. మానవులను శోధించుటకు వాటికి ఉన్న శక్తి తాత్కాలికమే (1 కొరింధి 10:13).

యేసుక్రీస్తు ఈ లోకములో యున్నప్పుడు అపవిత్రాత్మ పట్టిన అనేకులను

ఆయన బాగుచేసెను. వారిలో నుండి అపవిత్రాత్మను పారద్రోలెను. అయితే అపవిత్రాత్మలు పట్టుకొని మానవులను ఎందువలన పీడించెనో మనకు వివరముగా తెలియదు గాని ఈ ఆత్మలపై యేసు క్రీస్తును ఆయన అపొస్తలులకును ఉన్న శక్తిని నిరూపించుట కొరకు బహుశ తాత్కాలికముగా దేవుడు వాటిని మనుష్యులను పీడించనిచ్చెను. యేసు గాలిని సముద్రమును గద్దించి, నిమ్మళపరచి ప్రకృతిపై ఆయన అధికారమును నిరూపించెను (మత్తయి 8:27). పాపములు క్షమించి తన అధికారమును నిరూపించెను (లూకా 7:48). రోగులను స్వస్థపరచెను. చనిపోయిన వారిని లేవదీసెను (మత్తయి 4:23, యోహాను 11:44). యేసు దేవుని ఆత్మశక్తి వలన దయ్యములను వెళ్ళగొట్టెను (మత్తయి 12:29). అందునుబట్టి ప్రజలు ఆశ్చర్యపోయిరి. యేసు తన అపొస్తులులను పిలిచి అపవిత్రాత్మలను వెళ్ళగొట్టుటకును, ప్రతి విధమైన రోగములను, వ్యాధిని స్వస్థపరచుటకును వారికి అధికారమిచ్చెను (మత్తయి 10:1). ఈదురాత్మ లోకముపై క్రీస్తు యొక్కయు అపొస్తలుల యొక్కయు అధికారము క్రీస్తు మరణ పునరుత్థానముల యనంతరము గొప్పగా హెచ్చింపబడెను. "ఆయన ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేసి సిలువ జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుబరచెను" (కొలస్స 2:15). పాపము చేయువాడు అపవాది సంబంధి; అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను (1 యోహాను 3:8). దేవుని వాక్యమును స్థిరపరచుటకు అపొస్తలులు దయ్యములను వెళ్ళగొట్టిరి (మార్కు 16:17-20).

ఈనాడు కూడ దయ్యములు మానవులను పీడించు చున్నవని కొందరు భావింతురు. సువార్తలలో తప్ప క్రొత్త నిబంధనలో బహు అరుదుగా దయ్యములచే పీడింపబడుటను గూర్చి చెప్పబడినది. క్రీస్తు సువార్త వ్యాప్తి జెందే కొలది ఈ అపవిత్రాత్మల గొడవ లేకుండా పోయినట్లు మీరు గమనించగలరు. ప్రవక్తయైన జెకర్యా ఇట్లు వ్రాసెను: "ఆదినమున పాపమును అపవిత్రతను పరిహరించుటకై...............ఊట యొకటి తీయబడును. ఆ దినమున విగ్రహముల పేళ్ళు ఇకను జ్ఞాపకము రాకుండ దేశములో నుండి నేను వాటిని కొట్టి వేతును. మరియు ప్రవక్తలను అపవిత్రాత్మను దేశములో లేకుండ చేతును" (జెకర్యా 13:1-2). ఇంపైన ఊటవలె

క్రీస్తు రక్తము చిందింపబడినావాడు అపవిత్రాత్మ దేశములో లేకుండపోవును అని ఇక్కడ ప్రవక్త చెప్పుచున్నాడు. ఈనాడెవరయినా దయ్యములచే పీడింపబడుచున్న యెడల క్రొత్త నిబంధనలో మనము చదువు దానికి అది వేరుగా యున్నది. ముఖ్యముగా సువార్త ఎక్కడయితే ప్రకటింపబడెనో, ఎవరయితే సువార్తకు లోబడిరో అక్కడ వారికి దయ్యముల గొడవ ఏమియు లేదు. దేవుని వాక్యము వెళ్ళినచోట దయ్యములు నిలువనేరవు.

ఈనాడు దయ్యములచే పీడింపబడువారి కంటె దయ్యముల ప్రభావము కలిగి ప్రవర్తించువారు ఎక్కువ యున్నారు. కడవరి దినములలో కొందరు మోసపరుచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచుదురని 1 తిమో 4:1లో వ్రాయబడి యున్నది. "అన్యజనులర్పించు బలులు దేవునికి కాదు దయ్యములకే అర్పించుచున్నారు. మీరు దయ్యములతో పాలివారగుట నాకిష్టములేదు అని 1 కొరింధీ 10:20లో పౌలు వ్రాసెను. ఈ ఆధునిక యుగములో అపవాదియు తన దూతలును చాల దుష్టప్రభావమును మనుష్యులలో కల్పించి యుండుట మనము చూడగలుగుచున్నాము.

దురాత్మలను గూర్చి చదువుచున్నప్పుడు పాపము యొక్క తత్వమును గూర్చి మనము తెలిసికొనగలము. పాపము ఒకని ఎంత అధోగతికి తీసికొనిపోవునో తెలిసికొనగలము. మరియు యేసుక్రీస్తు యొక్క దైవత్వాన్ని ఆయన సర్వాధికారాన్ని గ్రహించుకొనగలము. అందుకే ఆయన మృతులలో నుండి పునరుత్థానుడై ఇహపరముల యందు నాకు సర్వాధికార మియ్యబడి యున్నది. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని చెప్పెను (మత్తయి 28:18; మార్కు 16:16). క్రీస్తును విశ్వసించుము. నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది అంధకార శక్తుల ప్రభావము నుండి విడుదల పొంది దేవుని వెలుగు రాజ్యములో ఈనాడే ప్రవేశించుము.

✍ - జాషువా గూటం

# దెలీలా

## (Delilah who had to have her Way)

ఇశ్రాయేలీయులు న్యాయాధిపతులలో ఒకడైన సంసోనుతో యుండిన సంబంధమును బట్టి దెలీలా పేరు బైబిలు చరిత్రలో వ్రాయబడుట కవకాశము కలిగెను. ఇశ్రాయేలీయులు తిరిగి దేవుని దృష్టికి దోషులు కాగా 40 సం॥రములు మట్టుకు దేవుడు వారిని ఫిలిష్తీయులు చేతికప్పగించెను (న్యాయా 13:1). సంసోనును గూర్చి కొన్ని విషయములు తెలిసికొనక మునుపు దెలీలాను గూర్చి తెలిసికొనుట సరిపోదు.

సంసోను దాను వంశస్థుడైన మనోహ కుమారుడు. పుట్టినది మొదలు చనిపోవు వరకు దేవునికి నాజీరు చేయబడిన వాడు. అతని తలమీద మంగల కత్తి వేయబడలేదు. అతడు దేవునికి నాజీరుగ యుండినంత కాలము మానవ బలమునకు మించిన అధికబలమును, శక్తిని దేవుడు సంసోనుకు అనుగ్రహించెను. ఆ బిడ్డ గర్భమున పట్టినది మొదలుకొని దేవునికి నాజీరు చేయబడిన వాడై ఫిలిష్తీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షింప మొదలు పెట్టెను (న్యాయా 13:5). ఇరువది సం॥రములు అతడు ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగ యుండెను. ఇతడు శారీరక బలము కలిగి యున్నను నైతికంగా కొన్ని బలహీనతలు కలిగియుండెను. అతడు అన్యస్త్రీలతో సహవాసము కలిగి యుండెడి వాడు. వారిలో దెలీలా ఒకతె.

ఈ దెలీలా గొప్ప ప్రావీణ్యత గల శోధకురాలు. ఈమె సంసోనును ప్రేమించుచున్నానని చెప్పి అతనిని మోసగించి అతని గొప్ప బలము దేనియందున్నదో తెలిసికొని శత్రువులైన ఫిలిష్తీయులను తెలియజెప్పుట కొరకు వారితో బేరము కుదుర్చుకొనెను (న్యాయా 16:5). దెలీలా వంటి స్త్రీని గూర్చి సామెతలు 5:1-13లో మనము స్పష్టముగ తెలిసికొనగలము. ఫిలిష్తీయుల సైన్యమంతటిని ఓడించగలిగిన బలమైన ధీరుడు సంసోను ఒక అన్యురాలైన స్త్రీ చేతిలో మిక్కిలి బలహీనుడై ఆమెకు లొంగిపోయెను. సంసోను యొక్క గొప్ప బలము దేని యందున్నదో తెలిసికొని దానిని ఫిలిష్తీయులకు తెలుపుయే తన కర్తవ్యముగ ఎంచి అతనిని మాటలచేత బాధించుచుండెను. ముమ్మారు సంసోనును ఆమె ఎగతాళి పట్టింది. తన బలమును

గూర్చి తెలుపకపోయినందున (న్యాయా 16:7,11,12; 16:13-14) ఆమె యొక్క మాటల వలన కలిగిన బాధను భరించలేక తన గొప్ప బలము దేనియందున్నదో ఆమెకు సంసోను తెలియపరచెను. అతడు తన అభిప్రాయమును తనకు తెలిపెనని దెలీలా యెరిగి ఆమె వర్తమానము పంపి ఫిలిష్తీయుల సర్దారులను పిలిపించి ఈసారికి రండి, ఇతడు అభిప్రాయమంతయు తెలిపెననెను. ఫిలిష్తీయుల సర్దారులు రూపాయలను చేత పట్టుకొని ఆమె యొద్దకు రాగా ఆమె, తన తొడమీద అతని నిద్రబుచ్చి ఒక మనుష్యుని పిలిపించి వానిచేత అతని తలమీద మెడ జడలను క్షౌరము చేయించి అతని బాధించుటకు మొదలు పెట్టెను (న్యాయా 16:18-19). భార్యతోటి పోరు ఎడతెగక పడుచుండు బిందువులతో సమానము (సామె 19:13). ముసురు దినమున ఎడతెగక కారు నీళ్ళును, గయ్యాళియైన భార్యయు సమానము (సామె 27:15). దెలీలా ఈ రకమునకు చెందిన స్త్రీ గనుక సంసోను విసిగిపోయి తన బలమును గూర్చి తెలియజెప్పి బలహీనుడయ్యెను.

దెలీలా తాను పొందిన విజయమును బట్టి పొందిన ఫలితము తన భర్త యొక్కయు, తన జనాంగము యొక్కయు, తన యొక్కయు నాశనము. సంసోనుతో పాటు ఫిలిష్తీయుల సర్దారు లందరు, రమారమి మూడువేల మంది స్త్రీ పురుషులు, వారితో బాటు దెలీలా అందరు మరణించిరి. ఫిలిష్తీయులు ఓడింపబడిరి.

ఒకడు తన ఒడిలో అగ్నినుంచి కొనిన యెడల వాని వస్త్రములు కాలకుండునా? (సామె 16:7). సంసోను దేవుని నుండి దూరమగుట దెలీలా తొడలపై నిద్రించుటకు దారితీసెను. దేవుడు అతనిని ఎడబాసెనని ఈతడు గ్రహింపలేదు. అతడు దేవునికి నాజీరు చేయబడినపుడు విధింపబడిన షరతులు అతనికి దేవుని మాట యందలి విధేయతను గూర్చి నటువంటివి. అవిధేయత సమస్త విధములైన పాపమునకు మూల కారణము. ఈ పాపమును సంసోను జీవితములో మనము చూడగలము. హవ్వ, మోషే లోతు భార్య, మిర్యాము మున్నగు వారి యొక్క పాపము చిన్న అవిధేయత గదా. అయితే అది చిన్నదే అయినప్పటికిని దేవునికి వ్యతిరేకముగా జరిగిన ఎంత మాత్రము చిన్నదిగ ఎంచబడదు. సంసోను దేవుని నాజీరుగ యుండినంత కాలము దేవుడతనికి తోడైయుండెను. సంసోనుతో మిక్కిలి సన్నిహిత సంబంధము

గలవారి ద్వారా అతనికి పతనము కలిగెను. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును (1 కొరింథీ 15:33). సంసోను అన్య స్త్రీల యొక్క సహవాసము ద్వారా దేవుని సన్నిధిని కోల్పోయెను.

ఫిలిష్తీయులు అతనిని పట్టుకొని అతని కన్నులను ఊడదీసి గాజాకు అతని తీసికొనివచ్చి యిత్తడి సంకెళ్ళచేత అతని బంధించిరి. అతడు బందీగృహములో తిరగలి విసురు వాడాయెను (న్యాయా 16:11-22). ఒక దైవజనునిగ సంసోను ఎంత హీనస్థితికి దిగజారిపోయెనో! ఇది అన్యస్త్రీ యొక్క సహవాసము వలన కలిగిన పాపఫలితమే. దెబోరా దేవుని యందలి విశ్వాసము చేత ఒక మనుష్యుని ధైర్యపరచి తన జనాంగమును శత్రుబారి నుండి రక్షించి వాటికి జయము చేకూర్చెను. దెలీలా ఒకదైవ జనుడైన మానవుని తన దురాశచేత లోపరచుకొని తన జనాంగము యొక్క నాశనమునకు కారకురాలయ్యెను. స్త్రీ పురుషునికి సహాయకారిగ యుండుటకు నిర్మించబడెను గాని పురుషునిపై ఆధిపత్యము చేయుటకుగాని, అతని నాశనమునకు నడిపించుటకుగాని నిర్మించబడ లేదు. సంసోను యొక్క నాశనమునకు దెలీలా కారకురాలయ్యెను.

- లోటీ బెత్ హాబ్స్

# బోధకులు యితరుల యెడల సరియైన మనస్తత్వము కలిగి యుండాలి

వినయము, నిస్వార్థత, నిష్కపట ప్రేమలు నిజక్రైస్తవుని లక్షణములు. బోధకుడు విజయవంతుడు కావాలంటే యివి అత్యవసరములు. "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప చూపును" అని యాకోబు చెప్పాడు (యాకో 4:6). దేవుడే కాదు, ప్రజలు కూడ అహంకారులను తిరస్కరిస్తారు. బోధకుడు గొప్ప జ్ఞానియై యుండి, వాక్చాతుర్యము గలవాడైనను ప్రేమతో బోధించలేని యెడల అతని వర్తమానము ప్రజలు అంగీకరించరు. అతన్ని ప్రజలు గౌరవించరు, ప్రేమించరు.

బోధకుడు వారిని ప్రేమించుచున్నాడో లేదో, వారియెడల ఆసక్తి కలిగినవాడో కాదో

ప్రజలు యిట్టే గమనించగలరు. బోధించునప్పుడు మన కళ్లు, ముఖ వర్చస్సు, శరీర కదలికలు వగయిరాలు మన మాటల కంటే ఏడు రెట్లు మన స్వభావాన్ని తెలియజేస్తాయి. మనం ప్రజలను నిష్కపట ముగా ప్రేమించకపోతే వారి మన్నన పొంద లేము. పౌలు థెస్స లోనికయలో యున్న క్రైస్తవులకు వ్రాయుచు, "మీరు మాకు బహు ప్రియులై యుంటిరి గనుక మీయందు విశేషాపేక్ష గలవారమై దేవుని సువార్తను మాత్రము గాక మా ప్రాణములను కూడ మీకిచ్చుటకు సిద్ధపడి యుంటిమి" యని చెప్పెను (1థెస్స 2:8). ఈ రీతిగ ప్రేమించు బోధకుడెవరైనను విజయము సాధించును. క్రైస్తవులు నిష్కపటమైన సహోదర ప్రేమ కలిగి యుండాలని అపొ.పేతురు చెప్పెను. (1 పేతురు 1:22).

మనము ప్రేమ కలిగి సత్యమును చెప్పినట్లయితే క్రైస్తవులు కానివారు కూడ సువార్తను వినుటకు ఆసక్తి చూపుదురు. నిజంగా మనం వారి నిత్య సంతోషాన్ని కాంక్షించుచున్నట్లు వారు గ్రహించుదురు. మతపరంగా వారు చేయుచున్న పొరబాటును మనం చూపించునపుడు లేదా వారి వ్యక్తిగత జీవితంలో యున్న పొరబాటును గూర్చి చెప్పునప్పుడు, వారిని తప్పు బట్టడానికి కాదుగాని, దేవుని చిత్తాన్ని వారు సరిగ గ్రహించుటకు సహాయము చేయుచున్నామని గ్రహిస్తారు. మనం సత్యం విషయములో రాజీ పడకుండా యితరులను క్రీస్తులోనికి ఏ విధముగానైనా తీసికొని వచ్చుటకు ప్రయత్నించాలి. "ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధముల వాడనై యున్నానని" అపొ.పౌలు చెప్పెను (1 కొరింథీ 9:19-22). అవును, అట్టి విధమైన మనస్తత్వము కొందరిని రక్షించును !

సరియైన మనస్తత్వము కలిగియుంటే బోధకులు శ్రమలకు లోనుకారు. బోధకులకు అనేకమందితో పరిచయము ఏర్పడును. మనం స్నేహభావము కనుబరుస్తు మంచినే చేసిన యెడల యితరులు కూడ మన సహవాసమును కోరుకొంటారు. అయితే అందరు స్నేహశీలులు కారు. కొందరు యితరుల పొరబాట్లనే ఎంచువారుంటారు. మరికొందరు అస్తమానము గొణుగుతారు. కొందరు స్వల్ప విషయాలకే కోపం తెచ్చుకొంటారు. ఇవ్విధమైన ప్రజలతో మనం పనిచేయునప్పుడు ఏదో ఒక సమయంలో సమస్యలు రావచ్చును.

మనలను గూర్చిన సమస్యగాని,

అపార్థముగాని, వాగ్వివాదము గాని తలెత్తితే, మన మనస్తత్వము సరియైనదైతే దాన్ని త్వరగా పరిష్కరించుకోగలము. మొదటిగా, సమస్యలను వ్యక్తిగతముగా పరిష్కరించు కొనుటకు ప్రయత్నించాలి (మత్తయి 18:15-18). యితరుల తప్పులను గాక, సమస్యను పరిష్కరించుకొనే తత్వము మనలో యుండాలి. ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును............ .....స్వప్రయోజనమును విచారించు కొనదు; త్వరగా కోపపడుదు (1 కొరింధీ 13:4-7). ప్రేమ యొక్క లక్షణములను బోధకులు అలవరచుకొంటే వారికి సమస్య లుండవు. కొందరు బోధకులు ఎక్కడికి వెళ్లినా అక్కడ వారికి సమస్యలే ఎదురవు తాయి. అంటే వారిలో ఎక్కడో లోపం ఉన్నదన్న మాట !

ప్రేమ, సంతోషము, సమాధానము కలిగి యుండు సంఘములు నెలకొల్పబడా లంటే అవసరమైన లక్షణములను కొన్నిటిని ఇప్పుడు గమనించుదాం. ఒకరినొకరు ప్రేమించుచు ఒండొరుల మేలును కాంక్షించు సభ్యులున్న సంఘమును కను గొనుట ఎంతో ఆనందము. దేవుని వాక్యము వారి హృదయాల్లో పనిచేయుట చూస్తుంటే ఎంతో ఆనందముగా యుండును. అట్టి వారు "ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" యను పౌలు హెచ్చరికను అనుసరింతురు (ఎఫెసీ 4:32).

ఆత్మ ఫలములను గూర్చి బోధింప బడాలి (గలతీ 5:21-22). అవి బోధకుల జీవితములోను, క్రైస్తవుల జీవితంలోను కను బరచాలి. బోధకులు పక్షపాతముతో యేమీ చేయకూడదు (1 తిమోతి 5:21). కులము, జాతి, వర్ణ, భాష, ధనము, విద్య మొదలగు వాటిని గూర్చిన వివక్షత బోధకులు చూప రాదు. దేవుడు పక్షపాతికాడు (అపొ.కా. 10:34). ప్రజలు మంచిగా ఇప్పుడును, నిత్యత్వములోను జీవించగల్గునట్లు చేయు మంచి తరుణమును బోధకులు కలిగి యున్నారు!!

✍ - చార్లెస్ స్కాట్

# సహస్రాబ్దిస్వామ్యం

(Millenniel Reign)

*(గత సంచిక తరువాయి)*

## రాజ్యాన్ని గూర్చిన అపోహలు

ఈనాటి అనేకులవలెనే క్రీస్తు ఈ లోకములో బోధిస్తున్న కాలములో కూడ రాజ్యం ఎలాంటిదో, ఎట్టి స్వభావాన్ని కల్గి యుండునో గ్రహించక, క్రీస్తు ఒక లౌకిక రాజ్యాన్ని స్థాపిస్తాడని కొందరు తలంచారు: జెబెదయ కుమారుల తల్లి "నీ రాజ్యమందు ఈ నా ఇద్దరు కుమారులలో ఒకడు నీ కుడి వైపునను ఒకడు నీ ఎడమవైపునను కూర్చుండ సెలవిమ్మని క్రీస్తును వేడుకొన్నది (మత్తయి 20:21). క్రీస్తుతో సిలువ వేయ బడిన వారిలో ఒకడు - "యేసూ నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకం చేసికొనుమనెను" (లూకా 23:42). క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన శిష్యులు కూడివచ్చి "ప్రభువా ఈ కాలమందు ఇశ్రా యేలు నకు రాజ్యము మరల అనుగ్రహించె దవా అని అడిగారు (అపొ.కా 1:6).

ఇశ్రాయేలునకు ఐహికమైన లౌకిక సంబంధమైన రాజ్యం తిరిగి స్థాపించబడు తుందని వారనుకొన్నారు గాని "దేవుని రాజ్యం ప్రత్యక్షంగా రాదు" అని క్రీస్తు చెప్పారు (లూకా 17:20).

## రాజ్యం ఆత్మసంబంధమైనది

"యేసు నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు. నా రాజ్యము ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడ కుండునట్లు నా సేవకులు పోరాడుదు గాని నా రాజ్యము ఇహ సంబంధ మైనది కాదనెను" (యోహాను 18:36). క్రీస్తు యొక్క రాజ్యము ఆత్మీయ మైనది.

"అందుకు పిలాతు నీవు రాజువా? అని ఆయనను అడుగగా, యేసు - నీవ న్నట్లు నేను రాజునే" అన్నాడు (యోహాను 18:37). "ప్రభువు పేరట వచ్చు రాజు స్తుతింపబడును గాక......." (లూకా 19:38). "ఇదిగో నీరాజు సాత్వికుడై........వచ్చు చున్నాడు" (మత్తయి 21:5) అను లేఖనాలు నెరవేరునట్లు జన సమూహములు మహా శబ్దముతో స్తోత్రం చేసారు. క్రీస్తు యొక్క

రాజ్యము లోక సంబంధమైనది కానట్లే క్రీస్తు లౌకిక రాజు కాడు. గనుకనే ఒకసారి ప్రజలు ఆయనను, "రాజుగా చేయుటకు వారు వచ్చి తన్ను బలవంతముగా పట్టుకొనబోవుచున్నారని ఎరిగి ఆయన మరల కొండకు ఒంటరిగా వెళ్ళెను" (యోహాను 6:15).

యేసు తన రాజ్యాన్ని స్థాపించుటకు పరిస్థితులు అనుకూలించక సంఘాన్ని స్థాపించాడు అనే వాదనలు పై వాక్యాన్ని బట్టి అబద్ధం. అపవాది క్రీస్తును తీసుకొని పోయి భూరాజ్యములన్నింటిని ఒక్క నిమిషములో ఆయనకు చూపించి నీవు సాగిలపడి నాకు నమస్కారము చేస్తే వీటన్నింటిని నీకిస్తానని చెప్పగా, యేసు సాతానా పొమ్ము అని అనలేదా? (లూకా 4:5; మత్తయి 4:9,10). లౌకిక రాజ్య స్థాపనకు క్రీస్తు సమ్మతించలేదు గనుక క్రీస్తు యొక్క రాజ్యం ఆధ్యాత్మిక సంబంధమైనది. దీన్ని గూర్చి యెషయా 2:2-4లో స్పష్టముగా ప్రవచింపబడింది: "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్త బడును. ప్రవాహము వచ్చి నట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేము నుండి యెహోవా వాక్కును బయలు వెళ్ళును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి; ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును; మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పు కొందురు. ఆయన మధ్యవర్తియై అన్య జనులకు న్యాయము తీర్చును. అనేక జనులకు తీర్పుతీర్చును. తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను ఈ టెలను మచ్చు కత్తులు గాను సాగగొట్టుదురు. జనము మీదికి జనము ఖడ్గమెత్తక యుండును. యుద్ధము చేయ నేర్చుకొనుట ఇక మాని వేయును".

పై ప్రవచనములోని నాల్గవ వచనాన్ని గమనిస్తే - భౌతిక యుద్ధము లకు స్వస్తి చెప్పుటకై యుద్ధాయుధములను పనిముట్టు లుగా మార్చుదురని ప్రవిచింప బడింది. దీన్ని బట్టి క్రీస్తు యొక్క రాజ్య స్వభావము ఆధ్యా త్మికమై నదని స్పష్టమగు చున్నది.


## ప్రవచనాల్లో రాజ్యం

"ఆ రాజుల కాలములో పరలోకమం

దున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దానిని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యము లన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగ యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44). నెబుకద్నె జరు రాజునకు స్వప్న మందు కన్పించిన బ్రహ్మాండమగు ఒక ప్రతిమను గూర్చి వ్యాఖ్యానిస్తూ దానియేలు రాజ్యాన్ని గూర్చి ప్రవచించిన వాక్కు ఇది. ఆ ప్రతిమకు చరిత్ర నుండి అన్వయించే భావం.

## నాలుగు సామ్రాజ్యములు :

1. శిరస్సు - బంగారం బబులోను సామ్రాజ్యం క్రీ.పూ.606-537
2. రొమ్ము, భుజములు వెండి. మాదీ, పారశీక సామ్రాజ్యములు క్రీ.పూ. 536-331
3. ఉదరం, తొడలు ఇత్తడి గ్రీకు సామ్రాజ్యం క్రీ.పూ. 330-146
4. మోకాళ్ళు, పాదములు ఇనుము+మట్టి రోమా సామ్రాజ్యం క్రీ.పూ. 146-క్రీ.శ.476



"తమరే ఆ బంగారపు శిరస్సు" (38వ)

"తమరి రాజ్యము కంటె తక్కువైన రాజ్యమొకటి లేచును" (39వ)

"లోకమంత ఏలునట్టి మూడవ రాజ్యమొకటి లేచును" (39)

"నాల్గవ రాజ్యము ఇనుమువలె బలముగా ఉండును" (40వ)

"ఆ రాజ్యములో భేదము లుండును" (41వ)

చేతి సహాయము లేక తీయబడిన రాయియే దేవుని రాజ్యము (దానియేలు 2:34, 44). ఆ రాజుల కాలములో అంటే, నాల్గవ రాజుల కాలములో - రోమీయుల రాజ్యపాలన అంతం కాకమునుపే దేవుని రాజ్యం స్థాపింపబడవలసి యుండెను; ఇదియే ఆధ్యాత్మిక రాజ్యం, క్రీస్తు రాజ్యం, క్రీస్తు సంఘం.

## రాజ్యాన్ని గూర్చి క్రీస్తు బోధలు

దానియేలు భావాన్ని బట్టి పరలోక రాజ్యం రోమీయుల పరిపాలన లోనే స్థాపించబడవలసి యుండెను. క్రీస్తు ఈ లోకములో రోమీయుల పాలనలోనే భౌతికముగా జీవించాడు.

1. "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" యని బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించాడు (మత్తయి 3:2). "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" యని క్రీస్తు బోధించాడు (మత్తయి 4:17).

2. "కాలము పరిపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" (మార్కు 1:15).

3. "నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చి యున్నది" (మత్తయి 12:28).

4. "ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది" (లూకా 17:21).

5. "నా కాలము సమీపమై యున్నది" (మత్తయి 26:18). "కాలము వచ్చుచున్నది, అది ఇప్పుడును వచ్చే యున్నది" (యోహాను 4:23).

6. పరలోక రాజ్యమును గూర్చి క్రీస్తు ఉపమాన రీతిలో విస్తారముగా బోధించాడు. గోదుమలు - గురుగులు (మత్తయి 13:24-30), ఆవగింజ (మత్తయి 13:31, 32), పులిసిన పిండి (మత్తయి 13:33), పొలములో ధనము (మత్తయి 13:44), ముత్యము (మత్తయి 13:45,46), చేపల వల (మత్తయి 13:47-49), చిన్న పిల్లలు (మత్తయి 19:14), ద్రాక్షతోట యజమాని (మత్తయి 20:1-6), పెండ్లి విందు (మత్తయి 22:1-3).

7. పునరుత్థానుడైన తరువాత క్రీస్తు నలుబది దినముల వరకు శిష్యులకు అగపడుచు "దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించెను" (అపొ. 1:3).

(మిగతా వచ్చే సంచికలో)

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

సుధాకర్ (సామర్లకోట) మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. స్త్రీలకు, పిల్లలకు జరిగిన ప్రత్యేక తరగతిలో సోదరి కబితా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. సంఘ స్త్రీలకు ఒక కుట్టుమిషన్‌ను ఆమె బహుకరించిరి. విధవరాండ్రకు దుప్పట్లు పంచిపెట్టిరి. సంఘ పనిని జాషువా దంపతులు ప్రోత్సహించిరి. పులిమేరులో యం.కృపానందం గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మే నెల 4వ తేదీ ఉదయం వేళంగిలో యున్న క్రీస్తు సంఘము నిర్మించుకొన్న నూతన బిల్డింగ్‌ను సోదరులు జాషువాగారు రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేసిరి. ఆ కార్యక్రమమునకు పలువురు హాజరైరి. టి.వి.యన్.కుమార్ మరియు ప్రసన్న కుమార్ గార్లు కూడ వాక్యోపదేశం గావించిరి. "పునాదులు పాడైపోగా నీతిమంతులేమి చేయగలరు?" (కీర్తన 11:3) అను అంశముపై జాషువాగారు గంభీరోపన్యాసము చేసిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వేళంగిలో శ్యామ్ ప్రసాద్ గారు వాక్యపరిచర్య చేయు చున్నారు.

మే 10, 11, 12 తేదీలలో కొత్తపేట మండలం పలివెలలో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించెను. జాషువాగారు, వి.చిన్నయ్య, డి.ఇశ్రాయేలు రాజు, మరియు కిరణ్ కుమార్ గార్లు వాక్యపరిచర్యలో సహకరించిరి. పలివెల క్రీస్తు సంఘము కూటములను సమర్థవంతముగా, జయప్రదముగా నిర్వహించిరి. సోదరులు పి.జె.కృపాలినీ గారు పలు సంవత్సరాలుగా పలివెలలోను, పరిసర ప్రాంతములలోను సమర్థవంతముగా సువార్త చాటుచున్నారు. క్రీస్తు కొరకు అనేక ఆత్మలను సంపాదించుచున్నారు.

వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్

**Vol. 4**

ఇప్పుడు లభించుచున్నది. అది ఉచితం

వలయువారు దిగువ

చిరునామాకు వ్రాయండి.

SATYA VANI

P.O.Box. 80,

Kakinada - 533 001

RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/02

From:

**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.